సాక్షి
హనుమకొండ
మంగళవారం । 15 । ఆగస్టు । 2023



కాల్వలో బాలుడి గల్లంతు
నగర పరిధిలోని ఎస్సారెస్పీ కాల్వలో సోమవారం బాలుడు విఘ్నేశ్వర్ గల్లంతు కాగా, మరో బాలుడు చరణ్‌ని స్థానికులు రక్షించారు. -IIలో



ఆరోగ్య'మస్తు'
నగరంలో ఆరోగ్యం కోసం కొత్త రకం పానియాలను నగరవాసులు ఇష్టపడుతున్నారు. గోధుమగడ్డి, బూడిదగుమ్మడి జ్యూస్‌లను తాగుతున్నారు. -IIలో

గరిష్టం/కనిష్టం
$33^0/25^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాజీపేట జంక్షన్‌లో రిటైరింగ్ గదులు ప్రారంభం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ఆధునికీకరించిన ప్రయాణికుల విశ్రాంతి గదుల(రిటైరింగ్ రూమ్స్)ను సోమవారం రైల్వే ఏరియా ఆఫీసర్ పి.వినోద్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం కోసం ప్రస్తుతం ఉన్న విశ్రాంతి గదులను విస్తరించి ఆధునికీకరించినట్లు తెలిపారు. మొత్తం 8 ఏసీ గదులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ విశ్రాంతి గదులు కావాల్సిన ప్రయాణికులు రైలు టికెట్ ఉండి ఐఆర్‌సీటీసీ ఆన్‌లైన్‌లోకి వెళ్లి విశ్రాంతి గదులను బుక్ చేసుకోవాలని సూచించారు. స్టేషన్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, సీసీఐ సజ్జన్‌లాల్, జీఆర్‌పీ సీఐ రాంమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్ అటాచ్‌మెంట్ క్యాంప్‌నకు ఎల్‌బీ విద్యార్థి



రామన్నపేట: కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో సోమవారం నుంచి 25 వరకు జరిగే ఆల్ ఇండియా ఏయిర్‌ఫోర్స్ అటాచ్‌మెంట్ క్యాంపునకు నగరంలోని ఎల్‌బీ కళాశాలలో బీకాం (కంప్యూటర్స్) ఫైనలియర్ విద్యార్థి బి.ప్రేమ్ ఎంపికైన ట్లు కళాశాల ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ అధికారి బి.ప్రభాకర్, ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ నుంచి బి.ప్రేమ్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

10వ రోజు 743 దరఖాస్తులు

కాజీపేట అర్బన్: వైన్స్ టెండర్ల దరఖాస్తులు సోమవారం పదో రోజు 743 దరఖాస్తులు వచ్చాయి. వరంగల్ అర్బన్ జిల్లా ఎక్సైజ్ పరిధిలోని ఖిలావరంగల్‌కు 96, వరంగల్ అర్బన్‌కు 149, హనుమకొండకు 309, కాజీపేటకు 189 దరఖాస్తులు వచ్చాయి. వీటిని కలెక్టరేట్‌లోని సెల్లార్‌లో హనుమకొండ ఎక్సైజ్ సీఐ రామకృష్ణ స్వీకరించారు. కాగా ఈ నెల 4 నుంచి 14 వరకు పది రోజులకు గాను 1,400 దరఖాస్తులు వచ్చాయి.

తహసీల్దార్లకు పోస్టింగ్

హన్మకొండ అర్బన్: వివిధ జిల్లాలనుంచి ఇటీవల జిల్లాలో రిపోర్ట్ చేసిన ముగ్గురు తహసీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఖిలా వరంగల్ నుంచి జిల్లాకు వచ్చిన ప్రవీణ్‌కుమార్‌ను కలెక్టరేట్ సీ సెక్షన్ సూపరిండెంటెంట్‌గా, శైలజకు హనుమకొండ ఆర్డీఓ కార్యాలయం డీఏఓగా, కలెక్టరేట్‌లో పనిచేస్తూ సెలవులో ఉన్న విజయలక్ష్మికి పరకాల డీఏఓగా పోస్టింగ్‌లు ఇచ్చారు.

డీటీలకు స్థానచలనం..
జిల్లాలో నలుగురు డిప్యూటీ తహసీల్దార్లకు స్థాన చలనం కల్పించారు. వీరిలో ప్రస్తుతం కలెక్టరేట్‌లో ఉన్న సంతోష్‌కుమార్‌ను ఎన్నికల విభాగానికి బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న సమ్మక్కను హనుమకొండ ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. యూసుఫ్ ఖురేషి కంతనపల్లి ప్రాజెక్ట్ నుంచి దామెరకు బదిలీ చేశారు. దామెరలో పనిచేస్తున్న రామకృష్ణను కలెక్టరేట్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: విదేశాల్లో ఎస్సీ విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించేందుకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఆర్ఈ, జీమ్యాట్, టోఫెల్, ఐలెట్స్‌లలో అర్హత సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో www.telangana.epass.cgg.gov.in అనే వెబ్‌సైట్‌లో సెప్టెంబర్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

స్పోర్ట్స్ స్కూల్స్‌లో అడ్మిషన్లకు ఎంపికలు

కాశిబుగ్గ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హైదరాబాద్ ఆదేశాల మేరకు ఖమ్మం, హనుమకొండ, వనపర్తి, రాజన్న సిరిసిల్ల, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం స్పోర్ట్స్ స్కూల్స్‌లో చదివేందుకు బాల, బాలికలు జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తారని వరంగల్ జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17, 18, 19, 20వ తేదీల్లో రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ జేఎన్ఎస్(హనుమకొండ), అథ్లెటిక్స్ అకాడమీ, సర్దార్‌పటేల్ స్టేడియం(ఖమ్మం), హాకీ అకాడమీ, డాక్టర్ బాలకృష్ణ స్టేడియం బాలుర ఉన్నత పాఠశాల(వనపర్తి), వాలీబాల్ అకాడమీ, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం(రంగారెడ్డి), సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీ సైక్లింగ్ వెలొడ్రోమ్ క్యాంపస్, తార్నాక(హైదరాబాద్), వాలీబాల్ అకాడమీ, మినీ స్టేడియం(రాజన్న సిరిసిల్ల) జిల్లాల్లో ఎంపికలను నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన బాలబాలికలు పైతేదీల్లో స్పోర్ట్స్ కోర్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 99851 45041లో సంప్రదించాలన్నారు.

వేడుకలకు సిద్ధమవుతున్న పోలీస్ పరేడ్ గ్రౌండ్



విద్యుత్ దీపాల వెలుగుల్లో హనుమకొండ కలెక్టరేట్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ రంగనాథ్



స్వాతంత్య్ర వేడుకలకు సిద్ధం

స్వాతంత్య్ర దినోత్సవానికి జిల్లా సిద్ధమైంది. కలెక్టరేట్, ఇతర ప్రభుత్వ భవనాలకు విద్యుత్ దీపాల అలంకరణ చేశారు. హనుమకొండలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం జరగనున్న స్వాతంత్ర దినోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ రంగనాథ్‌లు సోమవారం పరిశీలించారు. పరేడ్‌గ్రౌండ్‌లో వీవీఐపీల ప్రవేశం, విద్యార్థులు, నగరవాసులు, ప్రముఖులు, అవార్డు గ్రహీతలకు సీటింగ్ ఏర్పాటుపై పలు సూచనలు చేశారు. వాహనాల పార్కింగ్, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం, పోలీస్‌భద్రత తదితర అంశాలపై సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దని ఆదేశించారు. - వరంగల్‌క్రైం

పోలీస్‌లకు ఝలక్!

బదిలీలు, పోస్టింగ్‌లపై విచారణ, నివేదికకు ఎన్నికల సంఘం ఆదేశం

- 51 మందికి పోస్టింగులపై ఈసీకి ఫిర్యాదు..
- అత్యధికంగా వరంగల్ కమిషనరేట్‌లో 21 మంది
- ఈ పోస్టింగుల్లో రాజకీయ కోణంపై ఆరా



సాక్షి ప్రతినిధి, వరంగల్:

పోలీస్‌శాఖలో బదిలీలు, పోస్టింగ్‌లపై రచ్చ కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో ఎన్నికల కమిషన్ విధానాన్ని అమలు చేయకపోవడంపై అందిన ఫిర్యాదులపై ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) స్పందించింది. వరంగల్, కరీంనగర్, రామగుండం పోలీసు కమిషనరేట్‌లతో పాటు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జగిత్యాల జిల్లాల్లో 51మంది పోలీసు అధికారుల పోస్టింగ్‌ల్లో కమిషన్ నిబంధనలు పాటించలేదని పేర్కొన్నారు. అత్యధికంగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో 21 మందికి, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో ముగ్గురు చొప్పున నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు, పోస్టింగ్‌లు ఇచ్చారని ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ కోణం, వాస్తవాలను నివేదిక ద్వారా అందజేయాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి అవినాష్ కుమార్ తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ అధికారికి లేఖ నం. 434/1/టీఈఎల్/ ఎస్ఓయూ 3/ 2023 ద్వారా రాశారు.

అడుగడుగునా ఉల్లంఘనలే...?
ఫిర్యాదుల పరంపరపై ఆరా...

ఎన్నికల నేపథ్యంలో పారదర్శకంగా బదిలీలు, పోస్టింగ్‌లు ఇవ్వాలని లెటర్ నంబర్ 437/6/1/ఐఎన్ఎస్టీ/ఈసీఐ/ఎఫ్‌యుఎన్‌సీటీ/ఎంసీసీ/2023 ద్వారా తేదీ 02.06.2023న కమిషన్ సూచించింది. జిల్లాలు, కమిషనరేట్లలో పోలీస్ అధికారులకు సంబంధించి పలు మార్గదర్శకాలను పేర్కొంది. అందుకు విరుద్ధంగా గత నాలుగేళ్లలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అనేక మందికి తిరిగి జిల్లాలోనే పోస్టింగ్‌లు ఇచ్చారన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ తరహా పోస్టింగ్‌లకు సంబంధించి 51 మంది పేర్లతోపాటు వారు ఎక్కడెక్కడ, ఎంతకాలం పని చేశారన్న వివరాలను ఫిర్యాదులో చేర్చారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 21 మంది పోస్టింగ్‌లపై ఫిర్యాదులు ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లాలో ముగ్గురు, ములుగు జిల్లాలో ముగ్గురి పోస్టింగ్‌లు వివాదాస్పదం అయ్యాయి.

ఈ పోస్టింగ్‌లపైనే వివాదం

నాలుగేళ్లలో మూడేళ్లు పూర్తి చేసిన కొందరికి అదే ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చారని ఫిర్యాదు లున్నాయి. చీఫ్ ఎలక్టోరల్ అధికారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రిన్సిపల్ కార్యదర్శి రాసిన లేఖలో పేర్కొన్న ఎన్నికల కోడ్ వర్తించే అధికారుల జాబితా ఇలా ఉంది.

- జూలై 15న మామునూరు ఏసీపీగా నియమితులైన సి.సతీష్.. దుగ్గొండి సీఐతోపాటు ఆరేళ్ల పాటు వరంగల్ జిల్లాలో పనిచేశారు. ఇది కమిషన్ నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలానికి చెందిన వారు కూడా ఉన్నారు.
- ఎన్నికల కమిషన్ సూచనల మేరకు జరిగిన బదిలీల్లో పరకాల ఏసీపీగా పోస్టింగ్ తీసుకున్న కిషోర్ ఏడేళ్లుగా ఇదే జిల్లాలో పనిచేస్తున్నారు.
- 2014 ఎన్నికల్లో పని చేసిన డేవిడ్‌రాజ్ కాజీపేట ఏసీపీగా నియమితులయ్యారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే జిల్లాలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన కేయూసీ తదితర పీఎస్‌లలో పని చేశారు.
- గత ఎనిమిదేళ్లుగా వరంగల్ జిల్లాలో పనిచేసి ఎస్‌బీ ఏసీపీ నుంచి నర్సంపేటకు ఏసీపీగా బదిలీ అయిన పి.తిరుమల్ ఎనిమిదేళ్లు వరంగల్ కమిషనరేట్ పరిధిలోనే పని చేశారు.
- ఇంతేజార్‌గంజ్ సీఐ నుంచి శాయంపేట ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయిన మల్లేశ్ ఆయన సర్వీసు కాలమంతా వరంగల్ జిల్లా, కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించారు. జనగామ, నర్మెటలలోనూ సీఐగా పనిచేశారు.
- సీసీఎస్, టాస్క్‌ఫోర్స్‌లలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన కె.శ్రీనివాస్ ఐటీకోర్.. టాస్క్‌ఫోర్స్‌లకు మారగా.. ఎనిమిది సంవత్సరాలుగా వరంగల్ (కమిషనరేట్) జిల్లాలోనే పనిచేశారు.
- హనుమకొండ జిల్లాకు చెందిన పలువురు కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్, డీసీఆర్‌బీ, వెకెన్సీ రిజర్వు (వీఆర్)లలో పోస్టింగ్‌లు కొట్టారు. ఏసీపీ విజయ్‌కుమార్, సీఐలు రవికుమార్, దేవేందర్, కె.కుమారస్వామి, ఓ.రమేష్‌లు పై పోస్టింగ్‌లలో ఉన్నారు. సుబేదారి ఎస్‌హెచ్‌ఓ షుకూరుది వరంగల్ జిల్లా.
- ధర్మసాగర్ ఎస్‌హెచ్‌ఓగా నియమితులైన శ్రీధర్ తొమ్మిదేళ్లుగా వరంగల్ జిల్లా (పోలీస్ కమిషనరేట్)లో పని చేస్తున్నారు. హసన్‌పర్తి ఎస్‌హెచ్‌ఓగా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఆయన ధర్మసాగర్ ఎస్‌హెచ్‌ఓగా నియమితులయ్యారు.
- వరంగల్ జిల్లాలోనే తన సర్వీసు కాలమంతా పని చేసిన సీఐ సుజాతను కాజీపేట ట్రాఫిక్‌గా నియమించడం వివాదాస్పదమైంది. ఆరేళ్లుగా జిల్లాలోనే పనిచేస్తున్న మరో మహిళా అధికారిణి సువర్ణను కూడా రూరల్ మహిళ పోలీసుస్టేషన్ సీఐగా నియమించారు.
- ఆరేళ్లుగా జిల్లాలోనే పని చేస్తున్న రామకృష్ణ సీఐని గీసుకొండ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ఐదేళ్లుగా అర్బన్ మహిళ పోలీసుస్టేషన్ సీఐగా ఉస్మాన్ షరీఫ్ పనిచేస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లాలో ఏడు సంవత్సరాలు పనిచేసిన ఎస్ఐ ఎస్‌కే యాసిన్, నాలుగేళ్లు పూర్తయిన శ్రీనునాయక్‌ను అదే జిల్లాలో కొనసాగిస్తున్నారు. క్రిమినల్ కేసులో భాగస్వామి అని ఆరోపణలున్న రాణాప్రతాప్‌ను గూడూరు ఎస్ఐగా కూడా నియమించారు.
- ములుగు జిల్లా డీఎస్‌బీగా ఉన్న సట్ల కిరణ్, ఆర్ఐ కిరణ్, సీసీఎస్‌లో ఉన్న శివకుమార్‌లు దీర్ఘకాలికంగా అదే జిల్లాలో పనిచేసినా.. తిరిగి అక్కడే నియమించారన్న చర్చ ఉంది.

ట్యాంక్‌బండ్‌పై గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సంస్మరణ సభలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి: ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసి ఆయన పేరిట స్మృతి వనాలను నిర్మించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో గల అంబేడ్కర్ విగ్రహ సమీపం వద్ద ఏర్పాటు చేసిన గద్దర్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ముందుగా గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. గద్దరన్న స్నేహశీలి, గురువులతో సమానమని, ఆయన తన శ్రేయోభిలాషి అన్నారు. 2017, నవంబర్ 7న ప్రజాపోరు బాట యాత్రలో ఇదే ముల్కనూర్ వేదికపై గద్దర్ వచ్చి ఆట, పాటలతో ప్రజలను ఉత్తేజపరిచారని గుర్తు చేశారు. గద్దర్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరిపించడం సంతోషకరమన్నారు. ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరారు. భవిష్యత్ తరాలకు ఆయన గురించి తెలియాలంటే చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. డ్యాగల సారయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ జక్కుల అనీతరమేష్, జెడ్పీటీసీ వంగ రవిందర్, సర్పంచ్ మాడుగుల కొమురయ్య, ఎంపీటీసీలు బొల్లంపల్లి రమేష్, అప్పని పద్మ, జేఏసీ నాయకులు డ్యాగల సారయ్య, ఆదారి శ్రీనివాస్, మాట్ల వెంకటస్వామి, గుడెల్లి రాజిరెడ్డి, మండల సురేందర్, లాజరస్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, భిక్షపతి, చెప్యాల ప్రకాశ్, మాడ్గుల అశోక్, స్టాలిన్, కొమురయ్య, రమేష్, సుధాకర్, సంజీవ్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'చల్లా'పై దుష్ప్రచారం కేసులో ఇద్దరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిషోర్‌కుమార్

ఆత్మకూరు: సోషల్ మీడియాలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై దుష్ప్రచారం చేసిన కేసులో ఇద్దరిని రిమాండ్ చేసినట్లు ఏసీపీ కిషోర్‌కుమార్ తెలిపారు. మండలకేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని గుడెప్పాడ్ సమీపంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పేరు మీద ఉన్న 18గుంటల భూమి తనదని, దీంతోపాటు ఇంకా తన భూమిని ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఆక్రమించుకున్నారని నిరాధారమైన ఆరోపణలతో మండలానికి చెందిన జన్ను సంతోష గతంలో ధర్నా చేద్దామని పూనుకోగా కస్టడీలోకి తీసుకున్నామని తెలిపారు. భూమిపై విచారణ చేయగా సంతోష ఆరోపణల్లో నిజం లేదని తేలిందన్నారు. తిరిగి నెల రోజుల క్రితం జన్ను సంతోష, ఆత్మకూరుకు చెందిన సస్పెన్షన్‌కు గురైన సర్పంచ్ పర్వతగిరి రాజు ఫెన్సింగ్ తొలగిస్తుండగా పోలీసులు వెళ్లేసరికి పరారయ్యారన్నారు. కొద్ది రోజుల క్రితం పర్వతగిరి రాజు ప్రోద్బలంతో సంతోష సెల్‌ఫోన్‌లో ఎమ్మెల్యే ధర్మారెడ్డిని దూషిస్తూ నిరాధారమైన ఆరోపణలు చేస్తూ వీడియో చిత్రీకరించి సోషల్‌మీడియాలో పోస్టు చేసింది. కాగా మండలానికి చెందిన సంజీవ అనే వ్యక్తి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై బురద చల్లడానికి ఇలా వీడియోలు పెడుతున్నారని తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి టాస్క్‌ఫోర్స్ సహకారంతో పూర్తి విచారణ చేసి జన్ను సంతోష, పర్వతగిరి రాజులను అరెస్టు చేసి సోమవారం రిమాండుకు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ రవిరాజు, ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

'గ్రేటర్' ముట్టడి భగ్నం



వరంగల్ రాజీవ్‌గాంధీ విగ్రహం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు





నాయిని రాజేందర్‌రెడ్డిని, మహిళా నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

- ఎంజీఎం జంక్షన్‌లో బైఠాయించిన డీసీసీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, అనుచరులు
- పలువురు నాయకుల అరెస్ట్, వాహనాల్లో తరలింపు

వరంగల్ అర్బన్/వరంగల్/రామన్నపేట/మడికొండ: బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా.. సోమవారం కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయం ముట్టడిని పోలీసులు భగ్నం చేశారు. ఉదయం 10 గంటలకు నాయకులు పెద్దఎత్తున ఎంజీఎం జంక్షన్‌కు చేరుకున్నారు. ముందుగానే మోహరించిన పోలీసు బలగాలు ధర్నాకు అనుమతి లేదంటూ అడ్డుకున్నాయి. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. పోలీసులు కార్పొరేషన్ వైపు వెళ్లనివ్వకపోవడంతో నాయకులు రోడ్డుపైనే బైఠాయించారు. ఈసందర్భంగా రాజేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. హనుమకొండ, వరంగల్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేయూసీ నుంచి కాజీపేట వరకు చేపట్టిన రహదారి మరమ్మతులు ఇంకా ఎన్ని రోజులు సాగుతాయో చెప్పాలన్నారు. ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ అసమర్థత కారణంగానే ఇటీవల వర్షాలకు హనుమకొండ ముంపునకు గురైందన్నారు. నాలాలు, చెరువులు, ఎఫ్‌టీఎల్‌లు కబ్జాలకు గురువుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ధర్నాలో పాల్గొనేందుకు వస్తున్న వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులను అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో పోలీసులు రాత్రికి రాత్రే అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించడం నియంతృత్వ పాలనకు నిదర్శనమని రాజేందర్‌రెడ్డి మండి పడ్డారు.

నాయకుల అరెస్టు తరలింపు...

ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్న క్రమంలో ఎంజీఎం రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద పోలీసులు అడ్డుకోవడతో కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కడే బైఠాయించి సీఎం కేసీఆర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మీడియాతో రాజేందర్‌రెడ్డి మాట్లాడుతుండగానే ఆయనతో పాటు నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి మడికొండ శివారులోని సిటీ పోలీసు ట్రెనింగ్ సెంటర్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో పరకాల, వర్ధన్నపేట నియోజకవర్గ బాధ్యులు ఇనగాల వెంకట్రాంరెడ్డి, నమిండ్ల శ్రీనివాస్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళి, నాయకులు అశోక్‌రెడ్డి, రవీందర్, పులి రాజు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంకసరళ, మాజీ ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, కూర వెంకట్, సతీశ్, సమద్, రాజు, ఐలయ్య, సదానందం, సంపత్ యాదవ్, రాహుల్‌రెడ్డి, కార్తీక్, ముస్తాక్ నేహాళ్, దీపక్‌రెడ్డి, సుధీర్, సారంగం, మహేందర్, డివిజన్ అధ్యక్షుడు, యువజన, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వినతులు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



హసన్‌పర్తి: దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే రమేష్

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో ప్రజలనుంచి స్వీకరించిన వినతులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు కలెక్టర్ సిక్తా పట్నాయక్ హాజరై ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ సెల్‌లో ప్రజలనుంచి స్వీకరించిన వినతులను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ 14, తహసీల్దార్ ఎల్కతుర్తి 08, తహసీల్దార్ హనుమకొండ 07లతోపాటు వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 118 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ కుమార్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వర్ష ప్రభావిత ప్రాంతాల పరిశీలన

హసన్‌పర్తి: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లు, పంట పొలాలను హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్‌తో కలిసి హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి- సీతానాగారం గ్రామాల మధ్య వరదలతో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. స్థానికులు, రైతులు తమ ఆవేదనను కలెక్టర్, ఎమ్మెల్యే ముందు తెలిపారు. వరద కారణంగా పంట పొలాలు ఇసుక మేటలతో నిండిపోయాయన్నారు. పెగడపల్లిలోని ఎల్లమ్మ చెరువు వరద కారణంగా 200 ఎకరాల భూమి ముంపునకు గురవుతుందన్నారు. బైరాన్‌పల్లి-సీతానాగారం మధ్యరోడ్డు దెబ్బతినడం వల్ల రాకపోకలు స్తంభించి పోయాయన్నారు. కనీసం రోడ్డు దాటలేని పరిస్థితి నెలకొందన్నారు. రైతులు తమ పంట పొలాల వద్దకు వెళ్లలేకపోతున్నారని చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఎమ్మెల్యే.. ప్రజలకు ఇబ్బందులకు కలగకుండా ఉండేందుకు తాత్కాలిక పనులు చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతాల మధ్యరోడ్డు, వంతెనల నిర్మాణానికి రూ.2.72కోట్లు విడుదలయ్యాయని, ముందుకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధకారులను ఆదేశించారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి ఏర్పడకుండా ఉండేందుకు శాశ్వత ప్రాతిపదికన ప్రణాళిక రూపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదలశాఖ డీఈ రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు రేణుకుంట్ల సునీత, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్, జంగా కుమార్, వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్‌లు గోపాల్‌రెడ్డి, రాజేష్, కుమార్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వెంచర్ చేయకుండా ప్లాట్లు విక్రయిస్తే చర్యలు

ఎంపీఓ రవికుమార్

సాక్షి ఎఫెక్ట్

ఎల్కతుర్తి: రియల్ ఎస్టేట్ రంగంలో వ్యవసాయ భూములను కొని నిబంధనల మేరకు వెంచర్ చేయకుండా ప్లాట్లు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎంపీఓ రవికుమార్ అన్నారు. మండలంలో జరుగుతున్న ప్లాట్ల దందాపై 'బొమ్మగీసి అమ్ముకుంటున్నారు' శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎంపీఓ స్పందించారు. మండలంలోని పెంచికలపేట గ్రామ శివారులో అక్రమంగా కాగితాలపై ప్లాట్లు విక్రయిస్తున్న భూమిని ఆయన పరిశీలించారు. ఈ భూమిలో సూచికల బోర్డు సైతం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించిన వ్యక్తులపై పోలీస్ కేసు పెడతామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ప్రభుత్వ ఆదాయనికి గండి కొడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధ్యతలు స్వీకరించిన డీఎండబ్ల్యూఓ

న్యూశాయంపేట: వరంగల్ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి (డీఎండబ్లుఓ)గా పి.హరికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సీనియర్ అసిస్టెంట్ మహ్మద్ మున్వర్, డీఈఓ రాజు, టిమ్రిస్ కౌన్సిలర్ సర్వర్ మోహియొద్దీన్, మోహినుద్దీన్, షకీల్ అహ్మద్, మహ్మద్ గౌస్, టిపుసుల్తాన్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు

17 నుంచి శ్రావణమాసోత్సవాలు

● వేయిస్తంభాల దేవాలయం ఈఓ వెంకటయ్య


ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈఓ

హన్మకొండ కల్చరల్ : చారిత్రక రుద్రేశ్వరస్వామి వారి వేయి స్తంభాల దేవాలయంలో ఈ నెల 17వ తేదీ నుంచి (గురువారం) సెప్టెంబర్ 14వ తేదీ (గురువారం) వరకు జరిగే శ్రావణమాసోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ఈఓ కె వెంకటయ్య కోరారు. ఈమేరకు సోమవారం దేవాలయంలో ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మతో కలిసి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వెంకటయ్య మాట్లాడుతూ శ్రావణమాసంలో ఒక్కరోజు రుద్రాభిషేకానికి రూ.200, నెలరోజులు రుద్రాభిషేకంలో పాల్గొనే భక్తులు రూ.1000 చెల్లించి రశీదు పొందాలన్నారు. గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ శ్రావణమాసంలో ప్రతి సోమవారం విశిష్టమైందని స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేపూజలు జరుపుకోవడం వల్ల అభీష్టసిద్ధి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వేదపండితులు మణికంఠశర్మ, ప్రణవ్, సిబ్బంది రామకృష్ణ, రజిత పాల్గొన్నారు.

ఘనంగా మాసశివరాత్రి పూజలు..

వేయిస్తంభాల దేవాలయంలో అధికశ్రావణమాసం బహుళ త్రయోదశి సోమవారం మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి శివకల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం 5 గంటల నుంచి ప్రభాతసేవ, ఉత్తిష్టగణపతికి ఆరాధన, రుద్రేశ్వరుడికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం నాట్యమండపంలో రుద్రేశ్వరిదేవి, రుద్రేశ్వరస్వామివారిని ప్రతిష్ఠించి కల్యాణోత్సవం నిర్వహించారు.

ఆరోగ్య 'మస్తు'

● గోధుమ, గుమ్మడి, సొరకాయ, అలోవేరా జ్యూస్‌లతో ఆరోగ్యం
● గుండె జబ్బు, అధిక బరువు, అల్సర్‌కు చెక్
● హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ వద్ద వినూత్నంగా తయారీ
● నగరవాసుల నుంచి విశేష స్పందన


జ్యూస్ తయారీకి రెడీగా ఉన్న గోధుమ మొలక

హన్మకొండ చౌరస్తా : కరోనా తర్వాత వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు మరణాల సంఖ్య పెరుగుతోంది. పని ఒత్తిడో లేక ఏ ఇతర కారణాలతోనో ఈ డెత్ రేట్ రోజురోజుకూ అధికమవుతోంది. ఫలితంగా యువత నుంచి పెద్దల వరకు అందరూ ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యానికి వ్యాయామంతో పాటు ఆహార నియమాలు కూడా అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీంతో ప్రజలు ఆహారాలపు అలవాట్లపై శ్రద్ధ కనబరుస్తున్నారు. ముఖ్యంగా నగరవాసులు ప్రత్యేక కార్యాచరణ పాటిస్తున్నారు. భోజనం కంటే పండ్ల రసాలు, డ్రైఫ్రూట్స్ వైపునకు మొగ్గు చూపుతున్నారు.

వినూత్నంగా జ్యూస్‌ల తయారీ..

నగర జనం ఆసక్తి, అలవాట్లను గుర్తించిన హనుమకొండ బాలసముద్రం ప్రాంతానికి చెందిన సాయిరాంఆనంద్ పండ్ల రసాలు కాకుండా వినూత్నంగా జ్యూస్‌లు తయారు చేస్తూ ఆరోగ్య ప్రియుల మన్ననలు పొందుతున్నాడు. వినూత్నంగా గోధుమ గడ్డి, బూడిదగుమ్మడి, సొరకాయ, బీట్‌రూట్, క్యారెట్, అలోవేరా, కీరపుదీనాతో జ్యూస్ చేసి అందిస్తున్నాడు. ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఔషధాలుగా పనిచేస్తుండడం.. చక్కటి ఫలితాలు ఇస్తుండడంతో చాలా మంది ఈ జ్యూస్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ వద్ద సుమారు సంవత్సర కాలంగా ఆర్గానిక్ జ్యూస్‌లు తయారు చేసి ఇస్తూ మార్నింగ్ వాకర్లకు చక్కటి ఆరోగ్య ప్రదాయినిగా మన్ననలు పొందుతున్నాడు. ఇంతకీ ఏ జ్యూస్ తాగితే ఏ ఫలితం దక్కుతుందో తెలుసుకుందాం.

గోధుమగడ్డి జ్యూస్ : ఒక ట్రేలో గోధుమలను అలికిన తర్వాత ఏర్పడిన మొలకలను (వారం రోజుల్లోపు) జ్యూస్ చేసి అందిస్తున్నాడు. వీట్‌గ్రాస్ జ్యూస్ తీసుకోవడం వలన రక్తహీనత, చెడు కొవ్వు తగ్గి రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది. అలాగే, క్యాన్సర్ కారకాలను శరీరధరికి చేరకుండా చేస్తుంది.

బూడిదగుమ్మడి : బూడిదగుమ్మడి జ్యూస్ తీసుకోవడం వలన అధిక బరువు తగ్గుతుంది. షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటుంది. అల్సర్, అధిక వేడి తగ్గడంతోపాటు గుండె సంబంధిత జబ్బులు దరిచేరవు.

క్యారెట్ : రోజూ ఒక గ్లాసు క్యారెట్ జ్యూస్ తాగడం వలన చర్మం కాంతివంతం కావడం తోపాటు కంటి చూపు మెరుగుపడుతుంది. రోగ నిరోధక శక్తి కూడా పెంపొందుతుంది.

సొరకాయ జ్యూస్: సొరకాయ జ్యూస్ తాగడం వలన అధిక బరువు తగ్గడంతోపాటు శరీరంలోని అధిక వేడి, యూరిన్ ఇన్‌ఫెక్షన్ తగ్గుతుంది. అలాగే, గుండె జబ్బు నుంచి రక్షణ, మానసిక ఆందోళన తగ్గుతుంది.

బీట్‌రూట్ : ఈ జ్యూస్ వలన బీపీ నియంత్రించబడుతుంది. అలాగే, రక్తహీనత తగ్గి రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది. అజీర్తిని నివారిస్తుంది.

అలోవేరా : అలోవే జ్యూస్ తీసుకోవడం వలన లివర్ సంబంధిత వ్యాధులు దరిచేరవు. షుగర్ లెవల్ కంట్రోల్‌లో ఉంటుంది. అధిక బరువు తగ్గుతుంది.

కీరపుదీన జ్యూస్ : కీరపుదీన జ్యూస్ తాగడం వలన మలబద్ధకం నివారించడం, బీపీ నియంత్రణలో ఉంటుంది. ఎసిడిటీ అల్సర్ తగ్గించడం, అధిక వేడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

మరింత అవగాహన అవసరం



ఆరోగ్య ఔషధాలుగా పనిచేసే గోదుమగడ్డి, బూడిదగుమ్మడి, అలోవేరా, సొరకాయ, బీట్‌రూట్, క్యారెట్ లాంటి జ్యూస్‌ల ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. సుమారు సంవత్సర కాలంగా ఇలాంటి జ్యూస్‌లు చేస్తున్న. ఇప్పుడిప్పుడే వీటి గురించి అడిగి మరీ తాగుతున్నారు. ఈ జ్యూస్ తయారీలో నీరు, చక్కెర, ఐస్‌ను వినియోగించను. ఆయా జ్యూస్‌లను బట్టి పెప్పర్, జీరా, అల్లం, తేనే, నిమ్మరసం వేస్తుంటాం.

సాయిరాం ఆనంద్, జ్యూస్ సెంటర్ నిర్వాహకుడు

సత్ఫలితాలు ఇస్తున్నాయి



రోజూ పబ్లిక్‌గార్డెన్‌లో వాకింగ్ చేస్తుంటాను. రెండు నెలలుగా ఒక్కో రోజు ఒక్కో జ్యూస్ తాగుతున్నాను. శరీరంలో వేడి నియంత్రణలో ఉంటుంది. అల్సర్ లాంటి సమస్యలు రావడం లేదు. మానసికంగా చాలా ఉత్తేజం అనిపిస్తుంది. రోజూ చాయ్ , కాఫీకి బదులు ఉదయం పరిగడుపున ఈ జ్యూస్‌లను తాగితే చక్కటి ఆరోగ్యం ఔషధంగా పనిచేస్తాయి.

చల్లా లింగారెడ్డి, హనుమకొండ

మహనీయుల బాటలో నడవాలి

● వివేకానందుడు, కలాంను ఆదర్శంగా తీసుకోవాలి
● హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్


వివేకానందుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

గీసుకొండ: వివేకానందుడు, మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం చూపిన బాటలో నడవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్లలో వివేకానంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివేకానందుడు, కలాం, దివంగత పూజారి దేవుల్ల సత్యనారాయణ శర్మ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం శాపం కాదని దానిని ఎలా జయించాలో నేర్పిన మహనీయుడు కలాం అన్నారు. సమాజంలో సంపద పెరిగిందని, కానీ ప్రశాంత లేదని, మానవీయ సంబంధాలు అడుగంటాయన్నారు. బెల్టుషాపులు సామాన్య కుటుంబాలను గుల్ల చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతు బీమా పథకాలను బెంజికార్లలో తిరిగేవారికి, వేలాది ఎకరాలు ఉన్న భూస్వాములు, కలెక్టర్లకు ఇచ్చారని, దళితబంధు నెలకు రూ. లక్ష జీతం వచ్చే ప్రభుత్వ అధికారులకు ఇస్తున్నారన్నారన్నారు. ఆయా పథకాలను అర్హులకే వర్తింపజేయాలన్నారు. హైకోర్టు న్యాయవాది సౌమిత్రి లక్ష్మణాచారి మాట్లాడుతూ వివేకానందుడి బోధనలు యువతలో దేశభక్తిని పెంపొందిస్తాయన్నారు. వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ జిల్లా, రాష్ట్ర నాయకులు కొండేటి శ్రీధర్, రావు పద్మ, కుసుమ సతీష్, డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వన్నాల వెంకటరమణ, రాకేశ్‌రెడ్డి, జీకే రాంబాబు, గోదాసి చిన్నా, శ్రీరాంరెడ్డి, రమణారెడ్డి, తానం మనోహర్, రాధారపు శివకుమార్, కందికొండ మనోహర్ పాల్గొన్నారు.

చేనేత రుణాలు మాఫీ చేయాలి

● చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకట్రాములు


మాట్లాడుతున్న వెంకట్రాములు

వరంగల్: చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేసి సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. జాతీయ చేనేత వారోత్సవాల సందర్భంగా సోమవారం కొత్తవాడలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ స్వాతంత్య్ర పోరాటంలో చేనేత ప్రధాన భూమిక పోషించిందని, బ్రిటీష్ పాలకులను తరిమేందుకు జాతీయజెండాలో రాట్నం ఆయుధంగా నిలిచిందన్నారు. అంతటి ప్రాముఖ్యం గల చేనేత రంగాన్ని పాలకులు విస్మరించారన్నారు. ఫలితంగా చేనేత రంగం సంక్షోభం ఎదుర్కొంటుందన్నారు. దీనిపై ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే చేనేతపై జీఎస్టీని తొలగించాలన్నారు. శ్రమకు తగిన ఆదాయం లేకపోయినా లక్షలాది కుటుంబాలు చేనేతపై ఆధారపడి జీవిస్తున్నారని, నేత కులస్తుల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూచన సారయ్య, లింగబత్తిని రామకృష్ణ, కోటమల్లయ్య, గుండా రమేష్, లింగబత్తిని శంకర్, పుణ్యవతి, నూతి దామోదర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన ఉండాలి

● వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య


మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్

కరీమాబాద్: ఎన్నికల నిబంధనలపై అవగాహన ఉండాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియమితులైన రిటర్నింగ్, నోడల్ అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి 16 అంశాల వారీగా జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్‌బాషా, అడిషనల్ కలెక్టర్‌లు అశ్వినితానాజీ వాకడే, శ్రీవత్స, ఆర్డీఓలు, జిల్లా, మండల స్థాయి నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్ష

దళితబంధు, బీసీ రుణాలు, గృహలక్ష్మి, రెండో విడత గొర్రెల పంపిణీ, ఎస్‌డబ్ల్యూ పట్టాలు, జీఓ 58, 59, 84 అంశాలపై సంబంధిత జిల్లా అధికారులు, ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ప్రావీణ్య సమీక్షించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో జాప్యం లేకుండా నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వలో బాలుడి గల్లంతు

● మరో బాలుడిని రక్షించిన స్థానికులు


విఘ్నేశ్వర్ (ఫైల్)


దిలీప్ (ఫైల్)

హన్మకొండ చౌరస్తా/ హసన్‌పర్తి : హనుమకొండ 4వ డివిజన్ పరిధి దుర్గాకాలనీలో విషాదం అలుముకుంది. స్థానికంగా ఉన్న ఎస్సారెస్పీ కాల్వ వద్దకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు అందులో పడ్డారు. ఇందులో ఒకరు నీటి ప్రవాహానికి కొట్టుకుపోగా.. మరొకరిని స్థానికులు రక్షించారు. స్థానికుల కథనం ప్రకారం హనుమకొండ 4వ డివిజన్ దుర్గాకాలనీకి చెందిన కాల్వల జనార్దన్, శైలజ దంపతుల కుమారుడు విఘ్నేశ్వర్(12), పక్కింటిలో ఉంటున్న చరణ్ ఇద్దరు సోమవారం సాయంత్రం ఇంటి సమీపంలోని కెనాల్ కట్టపైకి వెళ్లారు. కట్టపై ఆడుకుంటుండగా కాలుజారి కెనాల్‌లో పడిపోయారు. దూరం నుంచి గమనించిన విఘ్నేశ్వర్ తమ్ముడు యువన్ హుటాహుటినా ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. అప్పటికే ఇద్దరు ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో కొట్టుకుపోయారు. ఈ ఘటనను చూసిన అక్కడే ఉన్న పలువురు తాడు సాయంతో చరణ్ బయటకు తీశారు. విఘ్నేశ్వర్ మాత్రం ప్రవాహంలో కొట్టుకుపోయాడు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు హనుకొండ పోలీసులకు సమాచారం అందించగా వారు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చరణ్‌ను వైద్యపరీక్షల నిమిత్తం ఎంజీఎం తరలించారు. గల్లంతైన విఘ్నేశ్వర్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, విఘ్నేశ్వర్ రెడ్డికాలనీలోని సెయింట్ థామస్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు.

ఎస్సారెస్పీలో కొట్టుకువచ్చిన మృతదేహం...

రాయపర్తి: ఎస్సారెస్పీ కాల్వలో ఓ మృతదేహం కొట్టుకొచ్చింది. ఈ ఘటన మండల కేంద్రం శివారు గుబ్బడిబోడుకింది తండాలో జరిగింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిమితెర జిల్లా తన్‌కమరియాకు చెందిన నేతం దిలీప్ (45) హుజూరాబాద్ ఇంద్రానగర్‌లో మేస్త్రీ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 11వ తేదీన ఇంటి అవసరాలకు కట్టెల కోసం బయటకు వెళ్లాడు. హుజూరాబాద్ శివారులో ఉన్న ఎస్సారెస్పీ కాల్వలో కాలు జారి పడి మృతిచెందాడు. ఎవరూ గుర్తించకపోవడంతో కాల్వలో కొట్టుకుపోవచ్చునని మృతుడి కుమారుడు రోషన్ హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం రాయపర్తి శివారులోని ఎస్సారెస్పీకి కొట్టుకొచ్చినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని తీసుకెళ్లారు.

ఓ నేత.. గలీజ్ పని

● స్నేహితుడి చెల్లితో సహజీవనం
● మూడేళ్లుగా రహస్య ప్రదేశంలో కాపురం
● పెద్దల సమక్షంలో పెళ్లి.. ఆ తర్వాత పరారీ
● మద్దతు పలికిన బంధువుపై దాడి

హసన్‌పర్తి: అధికార పార్టీ బహిష్కృత నేత గలీజ్ పనికి పాల్పడ్డాడు. స్నేహితుడి చెల్లితోనే మూడేళ్ల పాటు సహజీవనం చేశారు. రాజధానిలోని ఓ రహస్య ప్రదేశంలో కాపురం పెట్టాడు. విషయాన్ని ఛేదించి ఆ నేతను నిలదీశారు. చివరికి పెద్దలు ఆ యువతితో పెళ్లి చేయించారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని గుండ్లసింగారానికి చెందిన అధికార పార్టీకి చెందిన ఓ బహిష్కృత నేత తన స్నేహితుడి చెల్లిపై కన్నేశాడు. అప్పటికే ఆ నేత వివాహితుడు. భార్య, పిల్లలు కూడా ఉన్నారు. ఆ యువతితో రాసలీలలు బయటపడుతాయని భావించిన ఆ నేత ఆమెను రాజధానిలోని ఓ రహస్య ప్రదేశంలో ఉంచి మూడేళ్లుగా సహజీవనం సాగిస్తున్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు హైదరాబాద్ వెళ్లి ఇరువురిని తీసుకువచ్చారు. సోమవారం వారికి పెళ్లి చేశారు. కాగా, పెళ్లి అయిన మరుక్షణమే ఆ నేత అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా, పరారైన ఆ నేతకు సమీప బంధువు ఒకరు మద్దతు పలకగా స్థానికులు అతనిపై దాడి చేశారు. ఈ విషయాన్ని సదరు వ్యక్తి కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడినుంచి ఫిర్యాదు అందినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

కుమారుడి మరణం తట్టుకోలేక..

● తండ్రి ఆత్మహత్య ● జాన్‌పాకలో ఘటన

గీసుకొండ: కుమారుడి మరణం తట్టుకోలేక ఓ తండ్రి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ జాన్‌పాకకు చెందిన వరంగంటి రాజేశ్(50) భార్య రాజమని పదేళ్ల క్రితం మృతి చెందింది. అతడికి ఇద్దరు కుమారులు ఉండగా చిన్న కుమారుడు మంజునాథ్ అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 12న మృతి చెందాడు. అప్పటి నుంచి రాజేశ్ కుమారుడు లేడనే బెంగతో మద్యం తాగుతూ కుమిలిపోయేవాడు. ఈ నెల 13న ఇంటి నుంచి వెళ్లి తిరిగా రాలేదు. దీంతో అతడి కోసం వెతుకుతుండగా సోమవారం గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు కట్ట వద్ద అతడి ఆధార్ కార్డు, చెప్పులు కనిపించాయి. దీంతో చెరువులోకి దిగి గాలించగా రాజేశ్ మృతదేహం లభ్యమైంది. మృతుడి సోదరుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ సీఐ రామకృష్ణ తెలిపారు.

ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

స్వాతంత్య్ర దినోత్సవం దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది. దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తుంది. కాని దేశంలో సగమైన స్త్రీలు సంపూర్ణ స్వాతంత్య్ర ఫలాలు ఇంకా పొందవలసే వుంది. ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన, సంస్కారవంతమైన ప్రవర్తనను ఈ సమాజం చూపుతుందో అప్పుడే స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్య్రం వచ్చినట్టు. అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు. 'ఆకాశంలో సగం'లాగా దేశంలో సగం ఇంకెప్పుడు?



నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగుర వేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్య్ర ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.

స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్య్ర పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్య్ర పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాథలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్య్రంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్య్ర మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్య్రం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్య్రం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.



• ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్, శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వాహకులు

77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా...

ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు, శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్య్ర దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఴల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఴల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్పై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఴల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్య్రం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

> **శిక్ష కాలం సమాజంలోనే!**
> శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకు రావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుషులతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

స్వాతంత్య్రాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!

నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లుగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యత గల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....



- ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్య్ర భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు
- తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండి పోయేలా గడపండి.
- రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చిన వారవుతారు
- ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి
- మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి
- స్వాతంత్య్ర దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు
- పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్య్ర సమర యోధుల విజయగాథలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు
- దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మాన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి
- ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి
- దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్య్రాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్య్ర దినోత్సవాన్ని గౌరవించినట్లే

జీవన సేద్యం!

• పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం



• వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు

సాగుబడి

అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటారైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మీకంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బేవేరియా, మెటారైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటారైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను / 1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటారైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాబీన్, పెసలు మొలకల ద్రావణం, సూడోమోనాస్, బవేరియా, మెటారైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా



• జీవామృతం

మోతాదు ఎంత?

- ఎకరం పంటకు సగటున 100–120 లీ. నీటిని పిచికారీ చేయాలి
- మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్., పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి
- బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి
- మెటారైజిమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి
- హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి.
- కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి
- 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి
- ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి
- లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి
- పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో పిచికారీకి లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి
- అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి
- 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి
- 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి
- 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి.
- ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



• థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ఎడారిలో ఆశల మొలక

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చిగడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.



• మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చిగడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హెమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17.500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం– కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).